క్రీడాకారులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్‌లోని రాజీవ్‌గాంధీ నగర్ వెల్ఫేర్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ సేవన్‌లో విజేతగా నిలిచిన టీం స్ట్రైకర్స్ సభ్యులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మంగళవారం అభినందించారు. అదేవిధంగా ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, సెక్రటరీ నరేష్‌లను అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు.

వీధి లైట్ల సమస్యను పరిష్కరించండి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల్లో వీధి లైట్ల సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ సబిహా బేగం కోరారు. మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా తులసినగర్, శ్రీవివేకానందనగర్, శ్రీరామారావు నగర్‌లతో పాటు పలు బస్తీ, కాలనీల్లో వీధి లైట్లు వెలగక రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం సరైనదే

మోతీనగర్: సమాజహితం కోసం పని చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయటం సముచితమేనని బీజేపీ సీనియర్ నాయకుడు నార్లపురం శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ దివ్యాంగులకు, గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారుకు ఉచితంగా ఆపరేషన్లు చేసే విధంగా ప్రభుత్వంపై పోరాడిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

ఆస్పత్రి ఆవరణలో అన్నదానం



మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యుడు బిజముల్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నాలుగు రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జయంతి , లక్ష్మీనారాయణ, బ్రహ్మానందారెడ్డి, ఎస్. అంజిరెడ్డి, ఎస్‌వీ సాగర్, కొల్లప్ప, డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీపైన, తెలంగాణ పాటల గొంతుక గద్దర్‌పైన బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. చరిత్ర తెలియకుంటే తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుల్తాన్, అమీర్, అర్షద్ సోనూ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం

కూకట్‌పల్లి: మూసాపేట సర్కిల్ పరిధిలో పలు వార్డులలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించినట్లు డిప్యూటీ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీకాలనీ కె. శైలజ, బాలాజీనగర్ కె. నాగరాజు, అల్లాపూర్ గిరిధర్, మూసాపేట భిక్షపతి, ఫతేనగర్ ఎండీ రియాజుద్దీన్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

జ్యువెలరీ షాపుపై కేసు నమోదు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఓ ప్రముఖ జ్యువెలరీ షాపులో తూనికలు, కొలతల అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. పలు ఫిర్యాదులు రావటంతో తూనికలు, కొలతల జిల్లా అధికారి పి. సత్యనారాయణ బృందం ఆధ్వర్యంలో తూకం మెషిన్‌లో తేడాను గమనించారు. సుమారు 400 గ్రాములకు 16 మిల్లీగ్రాములు, 100 గ్రాములకు 4 మిల్లీగ్రాములు తేడా ఉందని అధికారులు తెలిపారు. దీంతో కేసు నమోదు చేశారు.

నైట్ హాల్ట్.. నరకమే!

జగద్గిరిగుట్ట బస్టాండ్‌కి నిత్యం 45 సిటీ బస్ సర్వీసులు, 13 జిల్లాల నుంచి వివిధ డిపోలకు చెందిన బస్సులు వస్తుంటాయి. ఇదే చోట వ్యాపార సముదాయాలు, పూల వ్యాపారులు, లేబర్ అడ్డాలు. ఇవన్నీ కేవలం 1000 గజాల జగద్గిరిగుట్ట బస్టాండ్‌లోనే. జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ సిబ్బంది నైట్ హాల్ట్ అంటేనే జంకుతున్నారు. స్థలం లేక వేంకటేశ్వరస్వామి కొండపై బస్సు పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో వారు పడే బాధలు అంతా ఇంతా కావు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు.

సౌకర్యాలు లేక ఆర్టీసీ సిబ్బంది సతమతం

- 13 జిల్లాల నుంచి బస్సులు రాక
- కనీసం మరుగుదొడ్లు కూడా లేని వైనం
- జిల్లాల బస్సులకు ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్



కొండపై పలు డిపోలకు చెందిన బస్సులను నిలిపిన దృశ్యం

జగద్గిరిగుట్ట: ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా జీడిమెట్ల, బాలానగర్, గాంధీనగర్ ప్రాంతాలు పేరొందాయి. పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో వివిధ జిల్లాల నుంచి ప్రజలు పనుల కోసం వలసలు వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. జనగాం, తొర్రూర్, హుస్నాబాద్, సూర్యాపేట, వనపర్తి, హన్మకొండ, మహబూబాబాద్, నర్సంపేట, యాదగిరిగుట్ట తదితర డిపోలకు చెందిన బస్సులు వస్తుంటాయి.

సిబ్బందికి వసతులేవి?

జిల్లాల నుంచి వచ్చే సుమారు 40 పైగా నైట్ హాల్ట్ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. బస్టాండ్‌లో స్థలం సరిపోకపోవడంతో రాత్రి జగద్గిరిగుట్ట కొండపై ఉన్న ఖాళీ స్థలంలో బస్సులు నిలుపుతున్నారు. ఇక అక్కడ తాగటానికి నీరు కూడా లేదు. ఆదాయం పైన దృష్టి సారించే ఆర్టీసీ.. సిబ్బందికి వసతులు కల్పించడంలో విఫలమైందని ఆయా కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తినడానికి కూడా సరైన స్థలం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందికి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, తినడానికి స్థలం తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాత్రంతా జాగారమే..

నైట్ హాల్ట్‌కు వచ్చే డ్రైవర్లు, కండక్టర్ల బాధలు వర్ణించలేనివి. దోమలతో కంటి మీద కునుకు లేకుండా ఎప్పుడు తెల్లారుతుందో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు కండక్టర్ల వద్ద డబ్బులు దగ్గర ఉండటంతో భయం భయంగానే ఉంటున్నారు. గతంలో కొండపై కండక్టర్‌ను కొట్టి అతని వద్ద నుంచి డబ్బులు దోచుకెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయి. బస్సు లోపల పడుకున్నా వారిని డోర్ తీయాలని, లేకుంటే అద్దాలు పగలగొడతామని బెదిరిస్తూ తాగుబోతులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వసతి లేక బస్సులోనే భోజనం చేస్తున్న సిబ్బంది

రాత్రి జాగారం చేస్తున్నాం



డబ్బులను కాపాడుకోవడం, దోమలతో పోరాడుతూ తినడం షరమామూలైంది. రాత్రి వేళల్లో కొండపైన బస్సుల చుట్టూ తాగి భయాభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో రాత్రంతా నిద్ర లేకుండా జాగారం చేయాల్సి వస్తుంది.

– వీరస్వామి, డ్రైవర్, తొర్రూర్ డిపో

నైట్ హాల్ట్ అంటేనే భయం



జగద్గిరిగుట్టలో నైట్ హాల్ట్ అంటేనే భయం వేస్తుంది. వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. కొండపై అన్ని దేవాలయాలు ఉండటం వల్ల మల విసర్జనకు కూడా కష్టవుతుంది. కనీస సౌకర్యాలు కూడా లేవు.

– వెంకటేశ్వర్లు, కండక్టర్, జనగాం డిపో

వినతులకు హామీలతోనే సరి!

ప్రతీ ఎలక్షన్‌లలో సెంటిమెంట్ కోసం ప్రచారం ఇక్కడి నుండే మొదలు పెట్టే నేతలు బస్టాండ్ అమలు విషయమై హామీలు ఇవ్వడం తప్ప ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో బస్టాండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ అప్పటి మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఇక వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రులకు అనేక దఫాలుగా వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు చొరవ చూపి కనీస వసతులతో బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ. 25 లక్షల కిచెన్ సామగ్రి చోరీ

మూసాపేట: కూకట్‌పల్లి అశోక వన్ మాల్‌లో ఏర్పాటు చేయనున్న ఓ రెస్టారెంట్‌లో కిచెన్ సామగ్రిని చోరీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..దేవర్‌పల్ల శివశంకర్ (32) కూకట్‌పల్లిలోని అశోక వన్‌మాల్‌లో రెస్టారెంట్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఈ నెల 26న మధ్యాహ్నం సిబ్బంది షాపునకు వెళ్లి చూడగా.. సుమారు 25 లక్షల విలువ గల ఫ్రిజ్, కిచెన్ వస్తువులు, గ్యాస్‌పొయ్యి, రా మెటీరియల్స్, టేబుల్స్ వంటి విలువైన సామగ్రి కనిపించటం లేదని గమనించారు. 25వ తేది రాత్రి 10 గంటలకు సిబ్బంది అదే షాపులో భోజనం చేసినప్పుడు సామగ్రి ఉందని, మరుసటి మధ్యాహ్నం సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ సమావేశ మందిరంలో కవి సమ్మేళనం జరిగింది. ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధ తన కవితను తెలుగులో వినిపించారు. దీంతో ఆమెను జస్టిస్ డాక్టర్ గుండా చంద్రయ్య, డా. జెబ్బంకి జగన్నాథ చార్యులు సన్మానించారు.

–మోతీనగర్

స్టార్టప్‌ల అభివృద్ధికే 'టీ-ఎడ్జ్'



టీహబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'టీ-ఎడ్జ్' కార్యక్రమాన్ని మంగళవారం ప్రకటించారు. పకడ్బందీ వ్యూహం, ఆవిష్కరణలతో స్టార్టప్‌లను అభివృద్ధి చేయడానికి భారతదేశంలోని ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్ దాని న్యాయ, ఆర్థిక బృందం కలిసి టీ-ఎడ్జ్‌ను ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. చట్టపరమైన, ఆర్థిక సేకరణ విషయాలపై సమగ్ర సలహాలను అందించడం ద్వారా స్టార్టప్‌లను బలోపేతం చేయడంపై టీఎడ్జ్ దృష్టి సారిస్తుందన్నారు.

టీ హబ్–నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మధ్య భాగస్వామ్యం

టీహబ్- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంల మధ్య భాగస్వామ్యం కుదిరింది. అనంతరం 'ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్'ను వేగవంతం చేయడంలో ఐపీ పాత్ర' అనే అంశంపై ప్యానల్ చర్చను నిర్వహించారు. టీహబ్ ఉపాధ్యక్షుడు సంతోషిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీఆర్ చైర్ డాక్టర్ అనింద్య సర్కార్, ఆస్కార్ లీగల్ సర్వీసెస్ వ్యవస్థాపకులు నవీన్‌కుమార్, రీసల్యూట్ గ్రూప్, రెసల్యూట్ 4ఐపిలో లీగల్ హెడ్ శభజిత్‌సాహ, ఓభన్ అండ్ అసోసియేట్స్‌లో భాగస్వామి చారుల్ యాదవ్ పాల్గొని తమ అభిప్రాయాలను ప్రకటించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన కాపీరైట్ సవాళ్ళు, ప్రపంచ పేటెంట్లను దాఖలు చేయడానికి ఆచరణాత్మక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అమలు, సవాళ్లపై సమావేశంలో చర్చించారు.

అదృశ్యమైన బాలికలను తల్లిదండ్రులకు అప్పగింత

మూసాపేట: కళాశాలకు వెళ్లి అదృశ్యమైన ఇద్దరు బాలికలను పోలీసులు మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కూకట్‌పల్లి, బాలానగర్‌కు చెందిన ఇద్దరు బాలికలు (17) కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం కళాశాల నుంచి బయటకు వెళ్లారు. ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా మంగళవారం బాలికల ఆచూకీని కనుగొని బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

2న మెగా జాబ్ మేళా

చింతల్: ఆదిత్య అండ్ మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కోడి ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించిన యువత కోసం సుమారు 15 పైగా కంపెనీల ద్వారా సుమారు 2000 పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, జెన్ ప్యాక్ తదితర బహుళ కార్పొరేట్ సంస్థల ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. మెగా జాబ్ మేళా చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తిగల యువత సద్వినియోగం చూసుకోవాలన్నారు. 8309447458, 96520 98401 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే వివేకానంద్



అల్లం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లోని అల్లం చెరువులో మురుగునీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం అల్లం చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.40 లక్షల నిధులతో అల్లం చెరువును అభివృద్ధి పరిచామన్నారు. ప్రజలకు ఆహ్లాదమైన వాతావరణంతో పాటు వాకర్లు నడిచేందుకు నడక మార్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

నేడు 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో 'డిజిటల్ యుగంలో సాంస్కృతిక వ్యక్తీకరణల వైవిధ్యం: అవకాశాలను వినియోగించుకోవడం, సవాళ్ళను నావిగేట్ చేయడం' అనే అంశంపై ప్రముఖ చిత్ర నిర్మాత, రచయిత, టీవీ ప్రముఖుడు సిదార్థ్ కాక్ ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

వరద కాలువ పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



వరద కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: వరద కాలువ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరద కాలువ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

అక్రమ వసూళ్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్: జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, పుష్పారెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గడ్డమీద బాలరాజు, దయాసాగర్, కరీం, చంద్ర, వెంకట్, సోమిరెడ్డి, మహేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ చింతల చెరువును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 329 ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను మరోసారి అధికారులు పెద్ద ఎత్తున కూల్చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో మంగళవారం మధ్యాహ్నం 8 గదులను కూల్చివేశారు. ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా సూరారం సీఐ భరత్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జూలైలో హైడ్రా అధికారులు ఇదే ప్రాంతంలో 40 పైగా



గదులను కూల్చివేశారు. తాజాగా నిర్మించిన 8 గదులను నేలమట్టం చేశారు. తమ ఇళ్లను కూల్చివేయవద్దని కొంతమంది బతిమిలాడినా వారిని అడ్డుకొని నిర్మాణాలను తొలగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీజేఆర్ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, మహవీర్ నగర్, పీజేఆర్ పోలీస్‌స్టేషన్, ఉదయం 12 నుంచి 3 గంటల వరకు వినాయక నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని వినాయక నగర్, సమతా నగర్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ పోలీస్‌స్టేషన్, వెస్టర్న్ హిల్స్ పరిధిలో అడ్డగుట్ట 1 నుంచి 7వ రోడ్డు, వెస్టర్న్ హిల్స్, అడ్డగుట్ట వాటర్ ట్యాంక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మూసాపేట: బాలాజీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆకార్ హాస్పిటల్, రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్, శివానంద హాస్పిటల్ ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కైత్లాపూర్‌లోని జెవేన్ హైట్స్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండరాజు కాలనీలోని శ్మశాన వాటికను పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మహిళలు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు. శానిటేషన్ అధికారులను పిలిచి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అదే కాలనీలో గ్లాండ్ ఫార్మా కంపెనీ నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, నాయకులు అంబటి సునీల్ కుమార్, శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మంగళవారం కొండాపూర్ ప్రేమ్‌నగర్‌కి చెందిన పగడాల శామిలికి రూ.2.20 లక్షలు, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌కు చెందిన వల్లేపల్లి వెంకట్ నరేష్‌కు రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, రాజు యాదవ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణాలను అరికట్టాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను అరికట్టాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లతో మంగళవారం మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంక్వయిరీ, కేటాయింపు, అర్హులకు రేషన్ కార్డుల జారీ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్‌లో జరుగుతున్న అవినీతిపై చర్చించారు. అధికారుల అలసత్వం, అవినీతి కారణంగానే నియోజకవర్గంలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు వంశీకృష్ణ, గంగాధర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో బండి రమేష్, అధికారులు, నాయకులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని ప్రగతి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల వార్షికోత్సవాన్ని ఔరా పేరుతో ×ఔరా× అనిపించే విధంగా గాజుల రామారంలోని సత్యగౌరి కన్వెన్షన్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్. ఎమ్. ఎస్. సత్యనారాయణ రావు, గౌరవ అతిథిగా డిపో మేనేజర్ డి. హరి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ రవీంద్రరావు, అనురాధ శాస్త్రి, బిందు, ప్రెసిడెంట్ రంగారావు, డైరెక్టర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేయడానికే పదవులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: పదవులు అనేవి ప్రజా సేవ కోసమే వినియోగించాలని, స్వప్రయోజనాలకు కాదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బోయిన్‌పల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమితులైన నల్లోల రాజేందర్, అస్లాం సోఫీ మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ను కలవడంతో వారిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, లక్ష్మయ్య, సంజీవ, మోహన్‌రెడ్డి, రమేష్, రాజుపటేల్, అరుణ్, నవాబు, కిట్టు, రమాదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌కు మిఠాయి తినిపిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు